తాగునీటి సమస్యకు చర్యలు చేపడతా

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నూతన మోటార్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మక్తల్ ఆగస్టు 16: మక్తల్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టేందుకే నూతన మోటార్లను ఏర్పాటు చేయడం జరిగిందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం పారేవుల వద్ద కృష్ణానది రోడ్డుపైన తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన ఇంటేక్‌వెల్ వద్ద శుక్రవారం నూతన 50హెచ్‌పీ 3 మోటర్లను మిషన్ భగీరథ అధికారులతో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. 53 గ్రామాలకు తాగునీటి సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ, ఏఈ, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

నారాయణపేట, ఆగస్టు 16: పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసులను పారదర్శకంగా విచారణ చేపట్టి శిక్షల శాతం పెంచాలని డీఎస్పీ లింగయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మక్తల్, మరికల్ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐలు చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

20నుంచి ఉచిత వైద్యశిబిరం

నారాయణపేట టౌన్, ఆగస్టు 16: పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు 5రోజుల పాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుప్రెషర్ మ్యాగ్నటిక్ చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ హరినారాయణ భట్టడ్ తెలిపారు. శుక్రవారం శిబిరానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

ధన్వాడ, ఆగస్టు 16: మండలంలోని కంసాన్‌పల్లిలో ఉపాధ్యాయులు లేక పాఠశాల మూతపడే అవకాశం ఉందని, వెంటనే ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరుతూ శుక్రవారం గ్రామ యువకులు డీఈవో అబ్దుల్ ఘనికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేశ్‌అనిల్, రాకేశ్, సునీల్ పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మహబూబ్‌నగర్, ఆగస్టు 16: జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తిని శుక్రవారం మధ్యాహ్నం టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడని మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన చాకలి బుడ్డయాదయ్య(45) బతుకుదెరువు కోసం కొంత కాలంగా మహబూబ్‌నగర్‌లో నివాసముంటూ వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లాకేంద్రంలోని పిస్తా హౌస్ బైపాస్ రోడ్డులో రోడ్డు దాటుతుండగా టిప్పర్ లారీ ఢీకొని తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, ప్రభుత్వ జనరల్ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 16: వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం నిర్వహించే సదరం స్లాట్ బుకింగ్ నెల 17వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ప్రారంభం కానున్నాయని డీఆర్‌డీవో నర్సిములు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి 28వరకు నిర్ణయించిన తేదీలప్రకారం సదరం క్యాంపులను నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తారని తెలిపారు.

పట్టుబడ్డ వాహనాలకు వేలంపాట

మహబూబ్‌నగర్, ఆగస్టు 16: జిల్లా పోలీసు శాఖ తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 30న బహిరంగ వేలం వేస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 76 వాహనాలు ఉన్నాయని, జడ్చర్లలోని పోలీసు శిక్షణ కేంద్రంలో ఉంచినట్లు తెలిపారు.

ధరణి పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- రైతుల వినతులు స్వీకరించాలి
- కలెక్టర్ విజయేందిర బోయి
- నవాబ్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో సమీక్ష

తాసీల్దార్ కార్యాలయంలో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

నవాబ్‌పేట, ఆగస్టు16: ధరణి పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన రైతుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఇందుకు తాసీల్దార్ నాన్యానాయక్ స్పందిస్తూ.. గతంలో నవాబ్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో 730 ధరణి కేసులు పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుతం వాటిని 33కు తగ్గించినట్లు చెప్పడంతో కలెక్టర్ ప్రత్యేకంగా వారిని అభినందించారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల జారీ, ఇతర కార్యాలయ పనులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. రైతుల నుంచి వచ్చే రుణమాఫీ ఫిర్యాదులను సైతం స్వీకరించి వారికి సమాధానం చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు కిరణ్‌కుమార్, గాయత్రి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

పేట: లోకపల్లిలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

జడ్చర్లలో పూజలు చేస్తున్న మహిళలు

మూసాపేట, ఆగస్టు 16 : అడ్డాకుల, మూసాపేట మండలకేంద్రాలతో పాటు, ఆయాగ్రామాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయాలకు కుటుంబ సమేతంగా వెళ్లి అమ్మవారికి కుంకుమార్చనలతో పాటు, వ్రతాలు నిర్వహించారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, ఆగస్టు 16 : వరలక్ష్మీ వ్రతాలను స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో టీటీడీ మాతృశక్తి ఆ ధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం టీటీడీ ప్రచారకర్త రామాచారివ్రతం యొక్క విశిష్టతను వివరించారు. కాగా అమిస్తాపూర్, తాటికొండ, అన్నాసాగర్‌లో వ్రతాలను నిర్వహించారు.

మహ్మదాబాద్‌లో..

మహ్మదాబాద్, ఆగస్టు 16: మండలంలో మహిళలు ఇంటింటా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు చేశారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒకరికొకరు వాయనం ఇచ్చిపుచ్చుకున్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

బాలానగర్‌లో..

బాలానగర్, ఆగస్టు 16: మండలంలోని బాలానగర్, ఉడిత్యాల, చిన్నరేవల్లి, మోతీగణపూర్‌లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్‌లోని భవానీమాత ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు అమ్మవారికి పూజలు చేశారు.

నారాయణపేటలో..

నారాయణపేట టౌన్/ నారాయణపేట రూరల్ ఆగస్టు 16 : పట్టణంలోని వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పాఠశాలలు, ఆలయాలలో సామూహికంగా, ఇండ్లలో మహిళలు వ్రతాలు ఆచరించారు. సింగారం బేస్‌లోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల, లోకపల్లి లక్ష్మమ్మ, బాపూనగర్‌లోని చౌడేశ్వరి ఆలయంలో నిర్వహించారు.

మరికల్‌లో..

మరికల్, ఆగస్టు 16: మండలంలోని చిత్తనూర్ రామాలయంలో భక్తులు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అర్చకులు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భూత్పూర్‌లో కలశపూజలు చేస్తున్న మహిళలు

నేడు పాలమూరు పట్టణం బంద్

పాలమూరు, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులకు మద్దతుగా శనివారం పట్టణ వ్యాప్తంగా పాలమూరు హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'మాట తప్పిన సీఎం రాజీనామా చేయాలి'

ధన్వాడ, ఆగస్టు 16: రాష్ట్ర ముఖ్యమంత్రి ఆగస్టు 15 వరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాట తప్పిన సీఎంరేవంత్‌రెడ్డి వెంటనే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోసపూరిత మాటలతో రైతులను, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

కొనసాగుతున్న నిరసన

జడ్చర్ల, ఆగస్టు 16: తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం జడ్చర్లలో శుక్రవారం కూడా కొనసాగింది. ఉదయం 11 గంటలకు బాదేపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మహేశ్, కేశవులు, శంకర్, రాజు, భారతి, స్వరూప ఉన్నారు.

టిప్పర్ ఢీకొని గొర్రెలు మృతి

మహ్మదాబాద్, ఆగస్టు 16: కంకర టిప్పర్ రోడ్డుపై వెళ్తున్న గొర్రెలను బలంగా ఢీ కొట్టడంతో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి సమీపంలో తాండూర్ వైపు నుంచి పాలమూరు వైపు వెళ్తున్న కంకర టిప్పర్ ఎదురుగా వస్తున్న బొగ్గుల ఆటో ని తప్పించబోయి రోడ్డుపక్క నుంచి వెళ్తున్న గొర్రెలను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ఆటో స్వల్పంగా దెబ్బతిన్నది. అందులో ప్రయాణిస్తున్న బాలుడికి స్వల్పగాయాలయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట, ఆగస్టు 16: పట్టణంలోని ఉపవిద్యుత్ కేంద్రం 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా చిన్నపిల్లల దవాఖాన ఫీడర్ పరిధిలో, యాదగిరి రోడ్డు ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం ఉంటుందని ఏఈ రఫీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

బైకులు ఢీ.. నలుగురికి గాయాలు

నవాబ్‌పేట, ఆగస్టు16: మండలంలోని కాకర్లపహాడ్ గేట్ వద్ద శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. హజిలాపూర్ పంచాయతీ గాల్లో నికుంట తండాకు చెందిన సురేశ్, గణేశ్, విశాల్‌అనే యువకులు నవాబ్‌పేట నుంచి జిల్లా కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, జిల్లా కేంద్రం నుంచి నవాబ్‌పేట వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తున్న కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన పాల శంకరయ్య ఎదురెదురుగా వస్తున్నారు. రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురికి గాయాలైనట్లు తెలిపారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా దవాఖానకు తరలించారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

బాలానగర్, ఆగస్టు 16: రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుందుభి వాగులో శుక్రవారం సాయంత్రం ఇసుకను ఫిల్టర్ చేస్తున్న ట్రాక్టరును పట్టుకున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు. రాయపల్లికి చెందిన నవీన్ గ్రామశివారులోని దుందు భి వాగులో మట్టిని ఫిల్టర్ చేస్తూ కృత్రిమ ఇసుకను తయారు చేస్తుండగా పట్టుకున్న ట్లు తెలిపారు. ఇసుకను తరలించేందుకు అనుమతుల విషయమై విచారించగా ట్రాక్టర్‌ను వదిలి పారిపోయాడని, ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వసతిగృహం తనిఖీ

జడ్చర్ల, ఆగస్టు 16: మండలంలోని పోచమ్మగడ్డతండా శివారులోని బాలికల వసతి గృహాన్ని శుక్రవారం జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి సందర్శించారు. వంటగది, స్టోర్‌రూం పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి, అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్
- మక్తల్ దవాఖాన ఆకస్మిక తనిఖీ

మక్తల్ దవాఖానలో వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, ఆగస్టు 16: ప్రభుత్వ దవాఖానలో సాధారణ ప్రసవాలు పెంచాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం మక్తల్ ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డును ప్రత్యేకంగా పరిశీలించి, జన్మించిన వెంటనే టోటల్ సిరం బిల్లు రూబిన్ టెస్ట్ వన్ నుంచి ఆరు దాటితే జాండీస్ ఏన్ బి ఎస్ యు వార్డు కు చిన్నపిల్లలను పంపాలని సూచించారు. ఆస్పత్రి పరిశీలిస్తుండగా మక్తల్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన రేవతికి నార్మల్ డెలివరీ కాగా, తల్లీబిడ్డకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, సీజనల్ వ్యాధులపై ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డెంగీ కేసులపై ఆరా తీశారు.రోజుకు 20 టెస్టులు చేస్తున్నామని ఇంకా ఆస్పత్రిలో 600 డెంగ్యూ కిట్స్ వాటిలో సిబ్బంది తెలిపారు. అలాగే వైరల్ ఫీవర్ కేసులు రోజుకు 60 నుంచి 80వరకు వస్తున్నాయని తెలిపారు. కుక్కకాటు బాధితులు ఎక్కువగా ఉన్నారని చెప్పారు.

గ్రామాభివృద్ధికి కార్యక్రమాలు కీలకం

నారాయణపేట టౌన్, ఆగస్టు 16: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని నైపుణ్య శిక్షణాభివృద్ధి కేంద్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాలిక మండళ్లు ఏర్పాటు చేసి బాల్య వివాహాలను అరికడుతున్నామని ఇన్‌చార్జి డీడబ్ల్యూవో జయ కలెక్టర్‌కు తెలిపారు. ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అనంతరం ఎల్ఆర్ఎస్ 2020 వెరిఫికేషన్, ఓటర్ లిస్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, డీఆర్డీవో మొగులప్ప, డీపీవో కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పీయూ పరిశోధక విద్యార్థినికి డాక్టరేట్

స్వాతిని అభినందిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 16: పాలమూరు విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని తంగళపల్లి స్వాతికి డాక్టరేట్ వరించినట్లు పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రకిరణ్ తెలిపారు. శుక్రవారం పీయూ కెమిస్ట్రీ విభాగంలో ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డా.శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఫైనల్ వైవా పూర్తి చేసిందన్నారు. పరిశ్రమల్లో కాలుష్య రహితంగా వస్త్ర, సామగ్రి, మందుల తయారీలో అత్యంత కీలకమైన 'లూయిస్ బేస్ ఆడక్ట్స్ ఆఫ్ డిమ్యూప్' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ వరించినట్లు పేర్కొన్నారు. స్వాతి 2018 నుంచి 2023 వరకు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రకిరణ్ గైడ్ టీచర్‌గా పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈమె పరిశోధనలకు 10 పబ్లికేషన్స్ రావడంతో పాటు 2 పేటెంట్ రైట్స్ లభించాయి. ఈ సందర్భంగా ఆమెను పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగాధిపతి శ్రీధర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ నూర్జహాన్, డా.విజయలక్ష్మి, పీఆర్వో రవికుమార్, డా.సిద్ధరాములు అభినందించారు.

పీయూలో ఐఎస్‌బీఎన్ పుస్తకావిష్కరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 16: డిజిటల్ మార్కెటింగ్, హెచ్‌ఆర్ అండ్ ఫైనాన్షియల్ రంగాలు, వాటి ప్రభావం అనే అంశాలపై రూపొందించిన ఐఎస్‌బీఎన్ పుస్తకాన్ని పీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మాట్లాడుతూ స్టార్టప్‌లు, తమ ఉత్పత్తులను డిజిటల్‌గా ప్రచారం చేయడంలో ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ ఎస్ఎన్.అర్జున్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో డిజిటల్ మార్కెటింగ్‌పై జరిగే పరిశోధన పత్రాలను ఇందులో పొందుపర్చామన్నారు.కార్యక్రమంలో పీయూ పీజీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డా.మనెమోని కృష్ణయ్య, విభాగాధిపతులు,అధ్యాపకులు ప్రభాకర్, నాగసుధ, రాజశేఖర్, జిమ్మికార్టన్, శ్రీధర్‌రెడ్డి, గాలెన్న, వెంకటేశ్, సురేశ్, సిలాస్, విజయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీకి ఎక్స్‌టెన్షన్ లెక్చర

కెమిస్ట్రీలో నూతన పరిశోధనలు, ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని గ్రామీణ విద్యార్థులు సీఎస్ఐఆర్, గేట్, నెట్‌లో అర్హతతో పరిశోధన రంగంలో రాణించే అంశాలపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు శ్రీధర్‌రెడ్డి పీయూ విద్యార్థులకు వివరించారు. శుక్రవారం పీయూలో కెమిస్ట్రీ విద్యార్థులకు ఎక్స్‌టెన్షన్ లెక్చర్ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 16: ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాల(బీఈడీ) మహబూబ్‌నగర్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్స్‌గా వివిధ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీలోగా మెట్టుగడ్డలోని డైట్ కళాశాల ఆవరణలోని బీఈడీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

డైట్‌లో గెస్ట్ లెక్చరర్స్..

ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్) మహబూబ్‌నగర్‌లో గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేరాజుల్లాఖాన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూమీడియంలో 13 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అర్హులైన అధ్యాపకులు, విశ్రాంతఅధ్యాపకులు, ఉపాధ్యాయులు, డైట్, బీఈడీ అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 21లోపు డైట్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

లైంగిక దాడి నిందితుడిపై కేసు నమోదు

నమస్తే ఎఫెక్ట్

- వైద్య పరీక్షల కోసం పేట జిల్లా దవాఖానాకు వృద్ధురాలు

ఊట్కూర్, ఆగస్టు 16: మండలంలోని పెద్దపొర్లలో వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి నిందితుడిపై పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. ఈనెల 8న ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి (60)పై గ్రామానికి చెందిన వాటర్‌మెన్ సత్యం బెదిరించి లైంగికదాడికి పాల్పడగా బాధిత కుటుంబం న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు సకాలంలో స్పందించకపోగా నిందితుడు సైతం కేసు వెనక్కి తీసుకోవాలంటూ బాధితురాలిని, కుటుంబ సభ్యులను బెదిరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఈనెల 16న 'వృద్ధురాలిపై లైంగిక దాడి..ఆలస్యంగా వెలుగులోకి' శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు శుక్రవారం నిందితుడిపై కేసు నమోదు చేశారు. బాధిత మహిళను వైద్యపరీక్షల నిమిత్తం జిల్లా దవాఖానాకు తరలించినట్లు మక్తల్ సీఐ చంద్రశేఖర్ విలేకరులకు తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితుడిని శిక్షిస్తామన్నారు.

ఢిల్లీ పంద్రాగస్టు వేడుకల్లో పాలమూరు విద్యార్థులు

శాంక్ విశ్వనాథ్ ముత్యాలంపల్లి తేజస్విని

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 16: ఢిల్లీలోని ఎర్రకోటలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మహబూబ్‌నగర్ విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో మహబూబ్‌నగర్ కేంద్రీయ విద్యాలయం పదోతరగతి విద్యార్థిశాంక్ విశ్వనాథ్, అలాగే గెలాక్సీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముత్యాలంపల్లి తేజస్విని ఉన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వికసిత్ భారత్ ప్రేరణ కార్యక్రమంలో భాగంగా 9వతరగతి నుంచి 12వతరగతి విద్యార్థులకు ఏప్రిల్ 10న జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో సత్తా చాటి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ విద్యాసదస్సుకు ఎంపికయ్యారు. గతనెల 27 నుంచి ఈనెల 3వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలో పర్యటించారు. ఈ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించారని విద్యార్థులు తెలిపారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

అంబులెన్స్‌లో సీపీఆర్ చేస్తున్న సిబ్బంది

హన్వాడ, ఆగస్టు 16: మండలంలోని టంకరకు చెందిన పార్వతమ్మ గురువారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వారి కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వెంటనే స్పందించి మహబూబ్‌బాషా, పైలెట్ అంజిలయ్య టంకర చేరుకుని ఆమెకు సీపీఆర్ చేసుకుంటూ దవాఖానకు తరలించారు. పార్వతమ్మ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు. ప్రాణాలు కాపాడిన 108 వాహన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

దేవరకద్ర, ఆగస్టు 16 : గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి పార్థసారథి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సిబ్బంది వివరాలు, హాజరుపట్టిక, కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల వివరాలు తదితర అంశాలపై కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సీతానాయక్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీల్లో క్రిమిలేయర్ రాజ్యాంగ విరుద్ధం

మూసాపేట(అడ్డాకుల), ఆగస్టు 16 : ఎస్సీ, ఎస్టీ వర్గాలలో క్రిమిలేయర్ అమలు చేస్తామనడం రాజ్యాంగ విరుద్ధమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. అడ్డాకులలో కులవివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుండడంతో వెనకబడిన జాతులకు రిజర్వేషన్ల అమలులో ఆశించినస్థాయిలో లభించడం లేదన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I, MOHAMMAD AMZAD HUSSAIN, S/o: MOHAMMED HUSSAIN, R/o: 5-4-85/F/20, Tayyab Nagar, Mahabub Nagar - 509001, Changed my name as MOHAMMED AMJAD MIYA
NT-MBNR

CHANGE OF NAME
★ I, MOHAMMED NAJEEMOHINUDDIN, S/o: MOHAMMED GOUSE MOINODDIN, Passport No: T 4821761, R/o